అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జనవరి 20 : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ దిశగా పనిచేస్తున్నదని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, గొల్ల బాపన్న, ఎన్‌జే. బోయేజ్, కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, నరేందర్ రెడ్డి, మిషేక్, అమ్మపల్లి బాలకృష్ణ, ఇను పురి గోకరయ్య, కరాటే శివ తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీ భవనం ప్రారంభం

కొత్తకోట, జనవరి20: మండలంలోని ద్వారకానగర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు.

పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ఎమ్మెల్యేకు లేదా..?

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు

- కలెక్టర్‌కు ఫిర్యాదు

వనపర్తి టౌన్, జనవరి 20 : పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ఎమ్మెల్యే మేఘా రెడ్డికి లేదా అని ఖిల్లా ఘణపురం మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ ప్రశ్నించారు. సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సుర భికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడుతూ ఇటీవల ఖిల్లా ఘణపురం మండలంలోని మల్కిమియాన్‌పల్లి గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పాటైనది, అన్ని గ్రామాలాగానే ఆ గ్రామంలో కూడా పల్లె ప్రకృతి వనం సర్వే నెంబర్ 4లో ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పల్లెప్రకృతి వనంలో పెరిగిన చెట్లను నరికివేశారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా స్వీకరించలేదని, గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేస్తే స్వీకరిస్తామని పోలీసులు చెప్పారని చెప్పారు. కార్యదర్శి ఫిర్యాదు చేస్తానని చెప్పి ఫిర్యాదు చేయకుండానే వెళ్లి పోయాడని దీనిపై ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. చెట్లను నరికివేసిన ప్రదేశంలో ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ నిర్మాణానికి శంకు స్థాపన చేయడానికి వచ్చాడని, ఆ సందర్భంలో కూడా ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. శంకుస్థాపన అక్కడ చేసి సర్వే చేశాక నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. సర్వే నెంబర్ 4లో 2.10ఎకరాల భూమి ఉండగా కొంత భాగం అన్యాక్రాంతానికి గురైందని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలే ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే ఎమ్మెల్యే, కలెక్టర్ జోక్యం చేసుకొని నిందితులపై చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని కోరారు. లేకపోతేలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

పౌర హక్కుల నేతల అరెస్టు శోచనీయం

అయిజ, జనవరి 20 : అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలం, మైలారంలో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన నిరసనకు మద్ధతు తెలిపేందుకు వెళ్లిన పౌర హక్కుల సంఘం నేతలు ప్రొఫెసర్ హర గోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్‌లను ప్రభుత్వం అరెస్టు చేయడం శోచనీయమని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య సోమవారం ప్రకటనలో ఖండించారు. గ్రామస్తులు అక్రమ మైనింగ్‌ను నిలిపి వేయాలని శాంతి యుతంగా పోరాడుతుండగా, ప్రభుత్వం పోలీసులతో పోరాటాన్ని అణచివేయాలని చూడడం చూస్తుంటే ప్రభుత్వమే వనరులను దోచుకునేందుకు వత్తాసు పలుకున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. పౌర హక్కుల నేతలు, గ్రామస్తులను వెంటనే విడుదల చేయాలని, అక్రమ మైనింగ్‌ను ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కులను కాలరాస్తే పోరాటం ఉధృతం చేస్తామని పౌర హక్కుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మైలారంలో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షల ప్రారంభానికి వెళ్లిన పౌర హక్కుల సంఘం నేతలు హర గోపాల్, లక్ష్మణ్‌ల తోపాటు గ్రామస్తులను అరెస్టు చేయడం అక్రమమని, పోలీసులు, ప్రభుత్వ ఆదేశాల తోనే అరెస్టు చేశారని పౌర హక్కుల సంఘం నేతలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, మహదేవ్, వెంకన్న విమర్శించారు. సోమవారం అయిజ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మైనింగ్ చేయడానికి వీలు లేదని చట్టాలు చెబుతున్నప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలు కలిసి అక్రమ మైనింగ్‌కు తెర లేపారన్నారు. ప్రజా స్వామ్యంలో శాంతియుతంగా దీక్షలు చేసేందుకు హక్కులు ఉన్నాయని, ప్రజల హక్కులను కాలరాసే హక్కులు ప్రభుత్వానికి లేవన్నారు. అరెస్టు చేసిన నేతలు, ప్రజలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఖజానాకు ఎసరు

- వడ్లు కొనకుండానే డబ్బులు డ్రా - విజిలెన్స్ విచారణలో విస్తృత నిజాలు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న అవినీతి వ్యవహారాలు

గద్వాల, జనవరి 20 : ధాన్యం కొను గోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు ఎసరు పెడుతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతుల పాస్ బుక్‌లు తీసుకొని వడ్లు కొనకుండానే అబద్ధపు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి డబ్బులు డ్రా చేసినట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది.

కొన్నిరోజులుగా జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు రహస్యంగా విచారణ చేపడుతున్న..సంగతి అందరికి తెలిసిందే..అయితే విజిలెన్స్ అధికారుల విచారణలో విస్తృత నిజాలు ఒక్క ఒక్కటి బయడపడుతున్నాయి. నిన్నటి వరకు సన్నరకం వడ్లు సరిహద్దులు దాటుతున్నాయి.. అంశం మరవక ముందే...మరో వ్యవహారం విజిలెన్స్ అధికారులు కూపి లాగితున్నట్లు తెలిసింది. కొను గోలు సెంటర్ నిర్వాహకులు, మిల్లర్లు ఇద్దరు కుమ్మకై రైతుల పాస్ బుక్‌లు తీసుకొని వడ్లు..లేకుండానే..డమ్మీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి డబ్బులు డ్రా చేసినట్లు విజిలెన్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని కొనుగోలు సెంటర్ నిర్వాహకులు రైస్ మిల్లుల యజమానులతో సత్ససంబంధాలు ఏర్పరచుకొని రైతుల పాస్ బుక్‌లను తీసుకొని డమ్మీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మిల్లుకు వడ్లు పంపినట్లు చూపి ప్రభుత్వ సొమ్మును డ్రా చేసినట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. అనంతరం వచ్చిన సొమ్ముతో మిల్లర్లు తక్కువ ధరకు వచ్చే దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తెప్పించుకుంటున్నట్లు తెలిసింది. మిగతా నగదులో వీరితో పాటు అధికారులకు కూడా వాటా ఇస్తున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అందరి కుమ్మకుతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఎసరు పెడుతున్నట్లు వ్యవహారం నడుస్తోందని జిల్లాలో పెద్ద మొత్తంలో చర్చ మొదలైంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి అవసరం ఉంది. ఈ విషయంపై వివరణ కోరేందుకు డీఎస్‌వో స్వామికుమార్ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు.

ఆర్డీఎస్ ఆనకట్టకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

అయిజ, జనవరి 20 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో కొన సాగుతోంది. తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కెనాల్ ఇండెంట్ నీటి విడుదల కొన సాగుతుండడంతో 5,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నది. సోమవారం ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆనకట్టపై ఓవర్ ఫ్లో 4,840 క్యూసెక్కులు వరద దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.7 అడుగుల మేర నీటి నిల్వ ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సుంకేసుల బ్యారేజీలో పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో తుమ్మిళ్ల ఎత్తి పోతల పతకం పంపు ప్రారంభించినట్లు ఈఈ పేర్కొన్నారు. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచి పోగా, అవుట్‌ఫ్లో 11,239 క్యూసెక్కులు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 64.112 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగులు గానూ, ప్రస్తుతం 1620.98 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, జనవరి 20 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహిస్తున్నందున అందుకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అందరినీ ఆకట్టుకునేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలన్నారు. జాతీయ భావం పెంపొందించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించేలా వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేడుకలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధిక ప్రాధాన్యత

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 45 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావులతో కలిసి కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

పేదల ప్లాట్లు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్దకల్, జనవరి 20 : మండలంలోని ఉల్గెపల్లి గ్రామంలో 30ఏండ్ల కిందట పేదలకు అప్పటి ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు గానూ ప్లాట్లను పంపిణీ చేసి వారికి ధ్రువీకరణ పత్రాలను కూడా అందజేసింది. కాగా ధ్రువీకరణ పత్రాలు అందుకున్న కొందరు ఇంటి నిర్మాణాలు చేసుకోగా మరి కొందరు నేటికి ఇండ్లు నిర్మించుకోలేదు. ఇదే అదునుగా భావించిన గ్రామానికి చెందిన తిమ్మయ్య తన ప్లాట్లుతో పాటు ఇతర ప్లాట్లలో ఇంటి నిర్మాణానికి పూనుకోగా స్థల యజమానులు దానిని అడ్డుకొని తాసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయిన తాసీల్దార్ నిర్లక్ష్యం వల్ల నేటికి న్యాయం చేయక పోవడంతో సోమవారం బాధితులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 102,103 సర్వేనెంబర్‌లో 85 మందికి అప్పట్లో పేదలకు ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ ప్రభుత్వం పట్టాలను అందజేసింది. అయితే గ్రామానికి చెందిన తిమ్మయ్య తనకు వచ్చిన ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టి ఇతరులు దాదాపు 10మంది లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లలో ఇండ్ల నిర్మాణాలు చేసుకుంటున్నాడని ఇదేమిటని అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరుల ప్లాట్లను అక్రమంగా ఆక్రమించుకొని పశువుల దొడ్డిగా వాడుకుంటున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇతని నుంచి తమకు రక్షణ కల్పిస్తూ తమ ప్లాట్లు తమకు చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

బీసీ వెల్ఫేర్ అధికారిని సస్పెండ్ చేయాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్

వనపర్తి టౌన్, జనవరి 20 : జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బీరం సుబ్బారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పీడీఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ మాట్లాడుతూ బీరం సుబ్బారెడ్డి హెచ్‌డబ్ల్యూవో కొండనాగుల హాస్టల్ నాగర్‌కర్నూల్ జిల్లాలో 2016సంవత్సరంలో ఉద్యోగంలో ఉన్నప్పుడు అక్కడ హాస్టల్‌లో ఉన్న 150 మంది విద్యార్థులకు అన్యాయం చేశాడని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారని, ఈ కేసు పెండింగ్‌లో ఉండగా ఉన్నతాధికారులను మభ్యపెట్టి, డబ్బులు ఇచ్చి ఈ ఆఫీసర్ వనపర్తి జిల్లాకు ఏబీసీడబ్ల్యూవోగా బదిలీపై నియామకమయ్యారన్నారు. డీబీసీడబ్ల్యూవో ఇన్‌చార్జిగా వనపర్తి జిల్లాలో 15 హాస్టళ్లకు, ట్రైబల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి జిల్లా అధికారి 5 ఎస్టీ హాస్టళ్లకు నియమించుకున్నాడని గుర్తుచేశారు. ఈయనపై ఏసీబీ రైడ్ చేసి క్రైం నంబర్ 86/ఆర్‌సీవో-హెచ్‌వైడీ/2016పై కేసు నమోదు చేసిందన్నారు. కాస్మోటిక్ బిల్లులు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, ఫుడ్ ప్రొవిజన్స్ (కిరాణం) లాంటివి ఇవ్వకుండా మోసం చేసి ఏసీబీకి దొరికి పోయాడన్నారు. ఈయనపై ఉన్న మరో ఆరోపణపై ఎల్ఆర్ నెంబర్ ఏ2/350/2024 బీసీ సంక్షేమ కమిషనర్ తెలంగాణ హైదరాబాద్ కమిషనర్ తెలంగాణ మెమో నెంబర్ ఏ1/1703/2023 కంప్లెయిట్ లెటర్ ప్రకారం డీబీసీడబ్ల్యూ సుబ్బారెడ్డితో పాటు మరో నలుగురికి విచారణ మెమో అందజేశారన్నారు. ఇందులో ఉన్న ప్రధాన ఆరోపణ దుప్పట్లు, అన్నం గిన్నెలు, గ్లాసులు మొదలైనవి బయట అమ్ముకోవడం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. జనవరి 1,2023 నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు నియమించారని ఉద్యోగుల కోసం నోటిఫికేషన్ ఇచ్చారా, ఎన్ని అప్లికేషన్లు వచ్చాయి, ఏ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.50వేల లంచం తీసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తుందన్నారు. డీబీసీడబ్ల్యూవో సుబ్బారెడ్డి ఆఫీస్, హాస్టళ్లలో పనిచేసే వర్కర్లను తన ఇంట్లో వంట చేయడానికి , మరొకరిని కారును శుభ్రం చేయడానికి, మరొకరిని ఆఫీస్ సెక్యూరిటీగా సొంత పనుల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటిపై పూర్తి స్థాయి విచారణ చేసి తక్షణమే డీబీసీడబ్ల్యూవో సుబ్బారెడ్డిని ప్రభుత్వానికి సరెండ్ చేసి చర్యలు తీసు కోవాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తయానా, ప్రవీణ్, రాజు, గణేశ్, రాజశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తిమృతి

ఎర్రవల్లిచౌరస్తా, జనవరి 20 : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తిమృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు ఆదివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి బీచుపల్లి వద్ద రోడ్డుదాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మెరున్ రంగు షర్ట్, బ్లూకలర్ పంచ, చేతికి ఆకుపచ్చదారం, ధరించి ఉన్నాడని, వయస్సు దాదాపు 40 సంవత్సరాలు ఉంటుందని, చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని గద్వాల మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు. ఘటన పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాలకు బహిరంగ వేలం

అలంపూర్, జనవరి 20 : అలంపుర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలు మారుతి షిఫ్ట్, టాటా ఇండికా కారులకు మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబీషన్ ఎండ్ ఎక్సైజ్ వారి ఉత్తర్వుల మేరకు జప్తు చేయబడిన వాహనాలను ఈనెల 22వ ఉదయం 11 గంటలకు అలంపుర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద వేలం నిర్వహించునున్నట్లు అలంపూర్ ఎక్సైజ్ సీఐ హన్మనాయక్ సోమవారం తెలిపారు. ఈ వేలం జోగుళాంబ గద్వాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

మున్సిపాలిటీ చట్టాలను అవహేళన చేస్తున్న కమిషనర్

- సమావేశానికి ఇతరులను పిలిపించి మాట్లాడించిన వైనం

వనపర్తి టౌన్, జనవరి 20 : మున్సిపాలిటీ చట్టాలను అవహేళన చేస్తూ వనపర్తి కమిషనర్ మున్సిపల్ సమావేశ మందిరంలోకి ఇతరులను పిలిపించి మాట్లాడించడం విడ్డూరంగా ఉందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోమవారం ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ సమావేశ మందిరంలోకి కేవలం కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తప్పా వేరేవారికి అవకాశం ఉండదని, కానీ మొన్న జరిగిన మున్సిపల్ సమావేశంలో కొందరు వ్యక్తులను అనుమతించి వారితో మాట్లాడించడం నేరం కాదా అని ప్రశ్నించారు. గతంలో మున్సిపల్ సమావేశాలు జరుగుతున్న సమయంలో కౌన్సిలర్ల భర్తలను ఆమడ దూరంలోనే ఆపేసేవారని, కానీ ఇప్పుడు ఏకంగా కౌన్సిలర్ భర్తలను వారి కుటుంబ వ్యక్తులను అనుమతించి వారితో తిట్ల పురాణాలు చేయించిన దేనని, ఈ సమావేశానికి బాధ్యులు ఎవరని అడిగారు. అసలు మున్సిపాలిటీ అనేది మురికిపాలిటీ చేసిన క్రమంలో ఈ సమావేశం చూస్తే ఏమని పేరు పెట్టాలో తెలియడం లేదంటున్నారు. మేధావులు వనపర్తి పట్టణానికి సేవలు అందించే మున్సిపాలిటీని ఈ కౌన్సిల్ మొత్తంలో ఇష్టానుసారంగా ఉపయోగించే కూరగాయల మార్కెట్‌లా తయారు చేస్తున్నారన్నారు. కొందరి అవినీతి అరాచక అడ్డాగా మున్సిపాలిటీ మారిందన్నారు. కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకొని దీనికి బాధ్యులైన వారిని శిక్షించాలని, కొంతకాలంగా జరుగుతున్న అవినీతిని కూడా అరికట్టాలని వాటిపై విచారణ చేయాలని దానిపై సమగ్రంగా తగు సాక్షాలను అందిస్తామని అణికపక్ష ఐక్య వేదిక నాయకులు కోరారు.

మాల మహానాడు నాయకుడిపై ఫిర్యాదు

అయిజ, జనవరి 20 : మాల మహానాడు జాతీయ నాయకుడిపై అయిజ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నాగరాజు హెడ్‌కానిస్టేబుల్ జయన్నకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 18వ తేదీన మాల మహానాడు జాతీయ నాయకుడు రామ్మూర్తి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసినందున ఆయనపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల, జనవరి 20 : జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు వెంటనే జిల్లాలో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కందుల కొను గోలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. 2024-25 వానకాలం సీజన్‌లో రైతులు పండించిన కందులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని అలంపూర్, వడ్డేపల్లి, అయిజ, పుటాన్‌దొడ్డి, గద్వాల మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ముందుగా బుధవారం అలంపూర్, వడ్డేపల్లి కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7,550 చొప్పున కొను గోలు చేయాలన్నారు. రైతులు నాణ్యమైన కందులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు.సమావేశంలో డీఏవో సక్రియానాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గౌరినగేశ్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, అధికారులు ఉపేంద్ర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పట్టణాభివృద్ధికి విశేష కృషి

అయిజ : మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్

అయిజ, జనవరి 20 : పట్టణ అభివృద్ధికి ఐదేళ్లుగా విశేష కృషి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, విద్యుద్దీపాలు వంటి వాటిని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 18 ఎజెండాలోని అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన కౌన్సిల్ ఆమోదించినట్లు మున్సిపల్ మేనేజర్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఏఈ రాజశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సౌకర్యాలు కల్పించాలి

అయిజ, పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సకల సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ పాలవర్గాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ మాల నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి, తిక్కవీరేశ్వర స్వామి ఆలయం వరకు గుంతల మయంగా మారిన రోడ్డు మరమ్మతులు చేపట్టడం తోపాటు స్తంభాలకు విద్యుద్దీపాలు, ఆలయ ప్రాంగణంలో హైమాస్ట్ విద్యుద్దీపాలు వెలిగిలా చూడాలన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగు నీటి వసతి కల్పించాలని, ఆలయ ప్రాంగణంలోని మినీ ట్యాంకులకు నల్లాలను ఏర్పాటు చేయాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

అయిజ, జనవరి 20 : అయిజ పట్టణానికి సమీపంలోని గద్వాల రోడ్డులో రెండు బైక్‌లు ఢీ కొని ముగ్గురికి గాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు మండలంలోని బింగిదొడ్డి గ్రామానికి చెందిన కుర్వ వీరాంజనేయులు, మల్దకల్ మండలం, నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులు బైక్‌పై అయిజ పట్టణానికి వస్తుండగా, మల్దకల్ మండలం, బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డె వీరేశ్ మరో బైక్‌పై అయిజ నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బింగిదొడ్డి గ్రామానికి చెందిన కుర్వ వీరాంజనేయులుకు బలమైన గాయాలై పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్‌లోని ప్రభుత్వ దవాఖానకు అంబులెన్స్‌లో తరలించినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, జనవరి 20: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మొత్తం 11 ఫిర్యాదులలో 4 భూ ఫిర్యాదులు, 5 పరస్పర గొడవల ఫిర్యాదులు, 2 భార్యాభర్తల ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

గోపాల్‌పేట, జనవరి 20 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని ఏదుట్లకు చెందిన మౌలాలీ, రేవల్లి మండలంలోని కేశంపేటకు చెందిన వెంకటేశ్ మద్యం తాగి బైక్ నడుపుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరిని వనపర్తి కోర్టులో హాజరు పరుచగా జడ్జి జానకి దీనిపై వెంకటేశ్‌కు మూడు రోజులు, మౌలాలీకి ఆరు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన

వనపర్తి టౌన్, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ,జడ్జి వి.రజిని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది మంది మహిళలు కన్నా ఎక్కువగా పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ , ఏ ఇతర సంస్థల్లో కానీ ఖచ్చితంగా నలుగురితో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను ఏర్పాటు చేసి సంస్థలో సీనియర్ మహిళా ఉద్యోగిని ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా నియమించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గురురాజు యాదవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

బయోడేటాను నమోదు చేయాలి

అయిజ, జనవరి 20 : వన్ ఇండియా వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి పూర్తి బయోడేటాను ఆటోమెటిడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టరీలో నమోదు చేయాలని ఎంఈవో రాములు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అపార్ నమోదు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలి

- ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జనవరి 20 : అన్ని గ్రామాలపై పోలీసులు నిఘా ఉంచి నేరాలకు సంబంధించిన సమాచారం ముందస్తుగా తెలుసు కోవాలని ఎస్పీ తోట శ్రీనివాస రావు పోలీస్ అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్‌ల వారీగా గత నెలలో నమోదైన కేసులపై ఆరా తీశారు. అందుకు సంబంధించి కేసు దర్యాప్తులో పారదర్శకంగా విచారణ చేపట్టాల్సిన అంశాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేందుకు అవకాశం ఉన్నందున ప్రతి గ్రామాన్ని పోలీస్ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని, గ్రామాల్లో సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్ రావు, సీఐలు నాగేశ్వర్ రెడ్డి, శ్రీను, రవి బాబు, టాటా బాబు, ఆర్ఐ వెంకటేశ్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

గద్వాల అర్బన్, జనవరి 20 : జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు పోగొట్టుకున్న, అపహరించిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తోట శ్రీనివాస రావు పేర్కొన్నారు. 38 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బాధితులకు ఎస్పీ అందజేసినట్లు తెలిపారు.

ఎట్టకేలకు నీటి విడుదల

రాజోళి, జనవరి 20 : నడ్డిగడ్డ ప్రాంత రైతులకు అండగా ఆనాడు కేసీఆర్ ఏర్పాటు చేసిన తుమ్మిళ్ల ఎత్తి పోతల పథకం రైతులకు వరంగా మారడంతో రైతులు రెండు పంటలు పండించేందుకు ముందుకొచ్చారు. ఈ ఏడాది కూడా రెండు పంటలకు నీరు అందుతుందని రైతులు పంటలను సాగు చేశారు. నెల రోజులుగా పంటలకు నీరు అందుతుందో లేదో అని రైతులు ఆందోళన చేయగా ఎట్టకేలాకు సోమవారం అధికారులు మోటర్లను ఆన్ చేసి పంటలకు నీరు వదిలారు.

ఆలయ ఈవోను సస్పెండ్ చేయాలి

గద్వాల అర్బన్/గద్వాల రూరల్, జనవరి 20 : కొన్నేండ్లుగా జోగుళాంబ , జములమ్మ, పాగుంట వేంకటేశ్వర స్వామి ఆలయాలకు ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న పురేందర్ అవినీతికి పాల్పడుతున్నారని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయాల్లో అవినీతికి పాల్పడుతూ అడ్డగోలుగా ఆస్తులు సంపాదిస్తూ ఆలయానికి భక్తులు సమర్పించే కానుకలకు లెక్క పత్రం లేకుండా అభివృద్ధి ముసుగులో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. బ్రహ్మోత్సవ సమయంలో భక్తులకు సరైన మౌలిక సదుపాయలు కల్పించకుండా కేవలం అధికార, రాజకీయ నాయకులకు రాచ మర్యాదులు చేస్తూ అధికారిగా కాలం వెల్లడిస్తున్నారని ఆరోపించారు. వచ్చిన ఆదాయంలో అధికార పార్టీ నాయకులకు సగం వాటా ఇస్తున్నట్లు ఆరోపించారు. ఈవో చేస్తున్న అక్రమాలపై ప్రత్యేక అధికారులతో విచారణ నిర్వహించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, దౌలత్, వీరేశ్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ విడుదల

ధరూరు, జనవరి 20 : పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ చైర్మన్ గిరిరావు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్‌పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని

ఖిల్లాఘణపురం, జనవరి 20 : మండలంలోని దొంతికుంటతండా సమీపంలో ఉన్న టీజీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కె.లీలావతి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి ఈ నెల 27న ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగబోయే హాకీ టోర్నమెంట్‌లో విద్యార్థిని పాల్గొననుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, పీడీ చందర్ తెలిపారు.

పీఎస్‌ల సంఘం అధ్యక్షుడిగా అజీజ్

గట్టు, జనవరి 20 : పంచాయతీ కార్యదర్శుల సంఘం గట్టు మండల అధ్యక్షుడిగా పంచాయతీ కార్యదర్శి అజీజ్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో ఎంపికను సోమవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా మారెప్ప, ఉపాధ్యక్షురాలిగా మానసను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖజ నీఫ్, కోశాధికారి ప్రదీప్, గట్టు మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

వనపర్తి టౌన్, జనవరి 20 : తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కోసం అర్హులైన క్రైస్తవ మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జలుద్దీన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడుపు పొడించారని, అర్హులైన క్రైస్తవ మహిళలు TGOBMMS పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొని దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత పత్రాలు జోడించి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం వనపర్తి ఐడీఓసీ రూమ్ నెంబర్ 207లో అందజేయాలని సూచించారు. క్రిస్టియన్ మైనారిటీస్‌కి చెందిన నిరుపేద మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు లేదా ఆహార భద్రత కార్డు తప్పనిసరి, రెండు కార్డులు లేక పోతే గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2లక్షల లోపు ఆదాయం సర్టిఫికెట్ ఉండాలన్నారు. 18-55 ఏండ్ల వయసు కలిగి వారు అర్హులని, కుటుంబం నుంచి ఒక కుట్టు మిషన్‌కి మాత్రమే దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. టీజీసీఎంఎఫ్‌సీ ద్వారా శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, 5వ తరగతి వరకు చదివి బీసీ-సీ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

గద్వాలటౌన్, జనవరి 20 : మైనార్టీ నిరుద్యోగ యువతకు వివిధ ఉద్యోగాల పరీక్షలపై ఉచిత శిక్షణా తరగతుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 15వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. గ్రూప్ 1, 2, 3, 4, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ తదితర పరీక్షలపై నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను జతచేసి జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.